


'జి-టెక్ జైన్'కు 'రాచపూడి' విద్యార్థులు

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ పట్టణం శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాలలో ఆధ్వర్యంలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఇందులో జి - టెక్ జైన్ కీర్తి, జి టెక్ జెనిక్స్ ఎడ్యుకేషన్ కంపెనీలో ఉద్యోగాలకు విద్యార్థులను ఎంపిక చేశారు. జి - టెక్ జైన్ కీర్తి, జిటెక్ జెనిక్స్ఎడ్యుకేషన్ కంపెనీలు ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతాలలో ఉన్న యువతకు ఐటి విద్యలో శిక్షణను అందిస్తున్నాయి. కార్యక్రమంలో సంస్థ హెచ్ఆర్లు సుఫియాన్, షాహిద్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత కల్గిన విద్యార్థులకు ఎంపిక చేశారు. బిఎస్సి కంప్యూటర్ సైన్స్ మూడవ సంవత్సరం విద్యార్థులు మనోజ్ఞ, హరిత, వెంకట సాయి, సరస్వతి, జ్యోతి ఎంపికయ్యారు. కార్యక్రమంలో శ్రీ నాగభూషణం డిగ్రీ కళాశాల అధ్యాపకులు కబీర్, రాధా, లక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ భారం ప్రభుత్వమే భరించాలి

- ధరలు అదుపు చేయాలి
- కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలి
- కరువు మండలాలను ప్రకటించాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్
- కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



మహాధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్


ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని, ధరలను అదుపు చేయాలని, కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని, కడప జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ డిమాండ్ చేశారు. గురువారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెనుభారాలు మోపు తున్నాయని, ధరలు పెరిగిపోతున్నాయని, సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని, దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి ఇప్పుడు ప్రజల పైన రూ.18 వేల కోట్ల ట్రూ అప్ ఛార్జీల పేరుతో భారాలు మోపడం సరైంది కాదని చెప్పారు. మరోపక్క విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు కోసం సమరశీల పోరా టాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. రాయలసీమ జిల్లాలో 54 కరువు మండలాలు ప్రకటిస్తే కనీసం కడప జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా మీకు కనపడలేదా అని ప్రశ్నించారు. నిధులు నికరజలాలు, విభజన హామీలు అమలు జిల్లా సమగ్ర అభివద్ధి కోసం కడప జిల్లా పట్ల వివక్ష విడనాడాలని చెప్పారు.. దశాబ్దాల తరబడి పెండింగ్లో ఉన్న గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగంగ ప్రాజెక్టులకు బడ్జెట్లో అరకోర నిధులు కేటాయిస్తే ఎప్పుడు పూర్తవుతాయని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, విద్యార్థుల ఫీజు రియిం బర్స్మెంట్, రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు ఇంతవరకు అతీగతి లేదని తెలిపారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ శిలాఫలకాలకే పరిమితమైందని పేర్కొన్నారు. జగన్పై కోపం ఉంటే రాజమండ్రి జైలలో వేయండి కానీ, అభివృద్ధిని అడ్డుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. గాలేరు-నగరి, హంద్రీ-నీవా ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడం దారుణమని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ విభజనహామీలోని ఉక్కు పరిశ్ర మలను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు లీకేజిలు అవుతున్నాయని, వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అన్నమయ్య డిమాండ్ కొట్టు కుపోయినట్లు బ్రహ్మంసాగర్ డ్యామ్ కొట్టుకుని పోవడం ఖాయమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాలు కల్పి ంచాలని పేర్కొన్నారు. ఖనిజ సంపద, స్థానిక సంపద ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. వలసలు పెరిగిపోతున్నాయని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన జగన్ జిల్లా అని ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని కోరారు. మహా ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ మోహన్, మనోహర్ ఐఎన్ సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, సత్యం, శ్రీనివాసులు రెడ్డి, అన్వేష్, నాయకులు చంద్రారెడ్డి బద్వేల్ నుంచి చాంద్ బాషా, వెంకటేష్, ఒంటిమిట్ట నుంచి నరస య్య, జమ్మలమడుగు నుంచి యేసుదాసు, విజయ్, శివ నారాయణ, వినయ్, పోరుమామిళ్ల నుంచి భైరవ ప్రసాద్, విద్యార్థి యువజన సంఘం నాయ కులు శివకుమార్, రవి, నరసింహ, రాహుల్, చిన్ని తో పాటు వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ సభ్యులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ప్రోత్సాహం : కలెక్టర్

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లాలోని మహిళా పొదుపు సంఘాలను ఈ-కామర్స్ బిజినెస్ వైపు అడుగులు వేయించి ప్రోత్సహించాలని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాలులో డిఆర్డిఎ, మెప్మా, డ్వామా పరిధిలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ రకాల పనుల పురోగతిపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డిఆర్డిఎ, మెప్మా పరిధిలో జరుగుతున్న మహిళాభివృద్ధి, సంకేమ కార్యక్రమాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత, పొదుపు సంఘాల బలోపేతంలోనే సాధ్యం అవుతుందని జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలతో పాటు వికలాంగులు, వృద్ధాప్య, ఎఫ్పిఒ, రాగ్ పికర్స్, చిరు వ్యాపారుల గ్రూపులను ఏర్పాటు చేసి.. వారి జీవన ప్రమాణాలను, ఆర్థిక స్థితిని మెరుగు పరచాలన్నారు. ప్రతి మండలం నుంచి చురుకుగా ఉన్న స్వయం సహాయక గ్రూపులను గుర్తించి వారిని ఈ కామర్స్ బిజినెస్లోకి అడుగులు వేయించాలన్నారు. వారికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు సరైన శిక్షణను అందించాలన్నారు. జిల్లాలో అర్హతలు కలిగిన అన్ని స్వయం సహాయక సంఘాలకు రానున్న నాలుగు నెలల్లో నిర్దేశిత లక్ష్యం మేరకు కొత్త రుణాలను రుణాలను మంజూరు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రాథమిక సెక్టారులోని వ్యవసాయం, ఇండస్ట్రియల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించాలన్నారు. సభ్యులందరికీ పెన్షన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, నివాస గృహాలు అందుతున్నాయా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, ఉన్నతి, వ్యవసాయ అనుబంధ, వ్యవసాయేతర ఉపాధి మార్గాల కల్పన, కోసం అందించే రుణ లక్ష్యాలపై, మహిళా మార్ట్ ల నిర్వహణ, చంద్రన్న బీమా, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాల అమలు సమీక్షించారు. డిఆర్డిఎ, మెప్మా సిబ్బంది ప్రతి ఒక్కరూ గ్రూప్ ఫార్మేషన్, ఫైనాన్సింగ్, గ్రౌండింగ్, బుక్ కీపింగ్ మొదలైన ప్రక్రియలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. మండలాల్లో సచివాలయాల వారీగా ఎన్ని స్వయం సహాయక సంఘాలు వున్నాయనే వివరాలను అందజేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేస్తూ.. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఎలాంటి పెండింగ్ లేకుండా సంపూర్తి చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో డిఆర్డిఎ, మెప్మా, డ్వామా పీడీలు ఆనంద్ నాయక్, సురేష్ రెడ్డి, జోయల్ విజయ్ కుమార్లతో పాటు డిపిఎంలు, ఏపీడీలు, మెప్మా సిఎంఎంలు, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

అమీన్ పీర్ దర్గా ఉరుసుకు ఏర్పాట్లు కట్టుదిట్టం

ఆస్థాన - ఏ - మగ్ధుముల్లాహి అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులకు ఆదేశించారు. అమీన్ పీర్ దర్గా ఉరుసు సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లపై గురువారం జిల్లా కలెక్టర్ పరిశీలించి, పలు సూచనలు జారీచేశారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలను ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా అధికారులందరి సమన్వయం చేసుకొని విజయవంతం చేయాలని అన్నారు. పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో భక్తులు రానున్నారని అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్సవాలకు కేటాయించిన అధికారులు, సిబ్బంది 24 గంటలూ దఫలవారీగా పనిచేయాలని చెప్పారు. 108 వాహనాలను దర్గా సమీపంలో, పార్కింగ్ ప్రాంతంలో ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. పరిశుభ్రత పాటించాలన్నారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ అందరి అధికారులు తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించి ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త లతో పనిచేయాలని చెప్పారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్, క్విక్ రెస్పాన్స్ బృందాలు బాధ్యతగా పనిచేయాలని చెప్పారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడూ పరిస్థితులను గమనించి లోటుపాట్లు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముందుగా దర్గా పీఠాధిపతులు కలెక్టర్కు సంప్రదాయబద్ధంగా ఆహ్వానం పలికారు. కలెక్టర్, జెసి దర్గాను సందర్శించి పూలచాదర్నుమర్పించి, ప్రార్థనలు చేశారు. అమీర్ పీర్ దర్గా ఉరుసు నిర్వాహకులు కలెక్టర్కు అమీర్ పీర్ దర్గా ప్రసిద్ధి, ప్రశస్థి గురించి తెలిపారు కార్యక్రమంలో కడప ఆర్డిఒ జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె. నాగరాజు, అగ్నిమాపక శాఖ అధికారి ధర్మారావు, సమాచార శాఖ ఎడి వేణుగోపాల్ రెడ్డి, ఆర్టిసి ఆర్ఎం, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం

ఎల్ఐసి యూనియన్ కళాజాతాలో యూనియన్ నాయకులు తిరుపతయ్య, సుజాత

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వరంగ సంస్థల ప్రాధాన్యతను కళాత్మకంగా ప్రజలకు చేరవేసి, వాటిని రక్షించుకోవడమే కళాజాతా లక్ష్యమని ఎల్ఐసి ఉద్యోగుల కళాజాతా సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, జోనల్ ఉపాధ్యక్షులు సుజాత అన్నారు. గురువారం రాజీవ్ పార్కు వద్ద ఎల్ఐసి యూనియన్ ఆధ్వర్యంలో కళా జాతా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, వ్యవసాయం, పరిశ్రమలు, స్టీల్, రైల్వేలు, ఆయిల్ రంగాల్లో సొంత కాళ్లపై నిలబడడానికి ప్రభుత్వ రంగ సంస్థలే కారణమని, వాటిని బలహీనపరచడం దేశానికి మంచి కాదని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ఎల్ఐసి, పోస్టల్ రంగాల విశ్వసనీయతకు, బిఎస్ఎన్ఎల్ ఇటీవల మళ్లీ పుంజుకోవడానికి, ఇప్పటికీ జాతీయ బ్యాంకులకు, గ్రామీణ బ్యాంకులకు ప్రజల మద్దతు కొనసాగడానికి ఆ సంస్థల పనితీరే కారణమని అన్నారు. విద్యుత్, ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ రంగంలోనే ఉండాల్సిన అవసరం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కళా జాతాలో భాగంగా ఎల్ఐసి యూనియన్ కళాకారులు నాటికలు ప్రదర్శించారు, పాటలు పాడారు.నృత్యాలు చేశారు. సుమారు 25 మంది కళాకారులు హాజరై ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో హైదరాబాద్ యూనియన్ నేతలు గిరిధర్, మద్దిలేటి, వివిధ సంఘాల నేతలు రఘునాథ రెడ్డి, అవధానం శ్రీనివాస్, వసుప్రద, సుధీకర్, సలాం, సంజయ్, నిత్యా (ఎల్ ఐ సి), శ్రీనివాసుల రెడ్డి (సిటు), సుదర్శన్ (విద్యుత్), సుబ్బారెడ్డి (పోస్టల్), మధు (రైల్వే), జగదీష్, శ్రీనివాసులురెడ్డి, అజీజ్, లలిత (బ్యాంకింగ్), సుంకర రవి (మునిసిపల్), లక్ష్మీదేవి(అంగన్వాడి), సుబ్బమ్మ (ఐద్వా), రామకృష్ణారెడ్డి (పెన్షనర్) ఇంకా అనేక రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

ఇంటింటా కేన్సర్ పరీక్షలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇంటింటా కేన్సర్ పరీక్షలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రారంభించిందని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.నాగరాజు అన్నారు. గురువారం రామకృష్ణనగర్లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కో-ఆపరేటివ్ కాలలో ఇంటింటా కేన్సర్ పరీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులకు బిపి, షుగర్, హిమోగ్లోబిన్, రొమ్ము, నోరు, గర్భాశయ ముఖ ద్వారా కేన్సర్ పరీక్షలు ఎఎన్ఎంలు, ఆశాలు సచివాలయ పరిధిలో నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలకు రక్తపోటు, రక్తహీనత, చెక్కర జబ్బుల వల్ల వచ్చే దుష్పరిమానాలను గురించి తెలియజేస్తారని చెప్పారు. స్క్రీనింగ్ వల్ల కేన్సర్ బారి నుంచి రక్షించుకోవచ్చునన్నారు. పోగాకు, గుట్కా, సిగిరెట్లు, ఆల్కాహాల్, జింక్ ఫుడ్ ఆహారపు అలవాట్ల వల్ల వచ్చే జబ్బుల గురించి ప్రజలకు వివించారు. సమావేశంలో డాక్టర్ రమేష్, డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ సుమధుర, ఎం.ఒ ఖాజా మోహిద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** అసంక్రమిక వ్యాధులు అరికట్టడంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆయుస్మాన్ ఆరోగ్య మందిరంలో గురువారం నిర్వహించిన సర్వే కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ నాగరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం, కేన్సర్ వంటి వ్యాధులు అంతర్గతంగా పెరుగుతాయని, వాటిని సత్వరమే గుర్తించి చికిత్స అందించడం చాలా ముఖ్యమన్నారు. దీని వల్ల మరణాలను అరికట్టవచ్చున్నారు. సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపి డమియాలజిస్ట్ ఖాజా, వైద్యులు రాఘవేంద్ర, డాక్టర్ సునీత, సామాజిక ఆరోగ్య వైద్యాధికారి సుకుమారన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చింతకొమ్మదిన్నె : పరీక్షలను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

'వర్రా'పై కేసుల పరంపర

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలైన వర్రా రవీంద్రారెడ్డి, సజ్జల భార్గవ్రెడ్డి, సిరిగిరెడ్డి అర్జున్రెడ్డిలపై కేసుల పరంపర కొనసాగుతోంది. ఈమేరకు అన్నమయ్య జిల్లా నందలూరు పిఎస్లో ఈనెల 8 న సిద్ధవటం మండలానికి చెందిన వాకమల్ల వెంకటాద్రి అనే దళితుడు అన్నమయ్య జిల్లా నందలూరు పోలీస్ స్టేషన్లో చేసిన ఫిర్యాదు గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈమేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిసిన వివరాల ప్రకారం.. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిరో ఎఫ్ఐఆర్ కింద ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి పులివెందుల పోలీసుస్టేషన్ను బదిలీ చేశామన్నారు. ఇదిలాఉండగా సదరు వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలు 2020 నుంచి రాష్ట్రంలోని రాజకీయ ప్రముఖులైన నారా చంద్రబాబు, నారా లోకేష్, హోంమంత్రి అనిత, పవన్కల్యాణ్, వై.ఎస్ షర్మిల, వైఎస్ సునీత, వైఎస్ విజయమ్మలపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడంపై ఫిర్యాదుల పరంపరం కొనసాగు తుండడం గమనార్హం. ఇందులోభాగంగానే ఈనెల 11న పోలీసులు వర్రాతోసహా మరో ఇద్దరిని అరెస్టు చేసిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా టిడిపి కార్యకర్తలు వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కేసులు నమోదు చేయడం, నోటీసులు జారీ చేయడంతో పరిస్థితి పతాకస్థాయికి చేరుకుంది.

రూ.10 వేలు ఇస్తేనే కేసు.. రైటర్, ఎస్ఐలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - చాపాడు : 'రూ.10 వేలు ఇస్తేనే కేసు నమోదు చేస్తాం' అని డిమాండ్ చేసిన ఘటనపై చాపాడు మండలంలో చోటు చేసుకుంది. గురువారం కేతవరానికి చెందిన ఖాదర్వలి సహవ్యాపారి శ్రనివాసగౌడ్ నుఅంచి రావాల్సిన బాకీ నిమిత్తమై చాపాడు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. రైటర్గా పని చేస్తున్న బాలయ్య, ఎస్ఐ చిన్న పెద్దయ్యలపై కేసు నమోదు చేయకుండా కాలయాపన చేయడమే గాకుండా లంచం డిమాండ్ చేయడంతో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కరుణాకర్ యాదవ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. కేతవరం గ్రామానికి చెందిన పి ఖాదర్ వల్లి గత కొన్ని ఏళ్లుగా కోళ్ల వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఖాదర్ వల్లి దగ్గర నంద్యాలకు చెందిన శ్రీనివాసగౌడ్ కోళ్లను తీసుకువెళుతూ వ్యాపారం నిర్వహించేవాడు. 2022 వరకు వ్యాపారానికి సంబంధించిన నగదు శ్రీనివాస్ పూర్తిగా చెల్లించేవాడు. ఆ తరువాత రూ.1.90 లక్షలు అప్పుచేసి ఆ తర్వాత బాధితుడు ఎన్నిసార్లు అడిగినా రేపు, మాపు అని కాలయాపన చేసేవాడు. ఆ తరువాత డబ్బు ఇవ్వకుండా చంపుతానని బెదిరింపుకు పాల్పడడంతో బాధితుడు చాపాడు పోలీసులను సంప్రదించాడు. రైటర్ కేసు నమోదు చేసుకోకుండా కొద్ది రోజులు కాలయాపన చేశాడు. తనకు న్యాయం చేయాలని అడిగితే రూ.10వేలు ఇస్తే కేసు నమోదు చేస్తామని డిమాండ్ పెట్టారు. దీంతో చేసేది ఏమీ లేక బాధితుడు హ్యూమన్ రైట్స్ కరుణాకర్ యాదవ్ తో కలిసి యూపీఐ ద్వారా రూ.10 వేలు రైటర్ బాలయ్యకు పంపగా ఖాతాలో అంతా నగదు లేదని చూపడంతో రూ.5వేలు పంపారు. బాధితుడు నగదు పంపిన తర్వాత ఈనెల 8న కేసు నమోదు చేశారు. ఈ వివరాలన్నింటినీ జత చేర్చి బాధితుడు హ్యూమన్ రైట్స్ వారితో కలిసి ఉన్నతాధికారులకు రైటర్, ఎస్ఐ లపై ఫిర్యాదు చేశారు. అవినీతి అధికారులు ఇప్పటికైనా మార్పు రావాలని కరుణాకర్ యాదవ్ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడంతో విషయం బహిర్గతమైంది. దీనిపై ఎస్ఐని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

అంధులకు పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) ఆధ్వర్యంలో గురువారం అంధుల పాఠశాల విద్యార్థులకు సీనియర్ సివిల్ జడ్జిఎస్ బాబా ఫక్రుద్దీన్ హియరింగ్ మిషన్లు, డైసీ లేయర్లు, వీల్ చైర్లు పంపిణీ చేశారు. కడప నగరం చెన్నూరు స్టాండ్ వద్దనున్న రాష్ట్రీయ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ అంధుల బాలుర పాఠశాలలో వైద్యాధికారులచే ఆడియో మెట్రేషన్ టెస్టులు నిర్వహించి అర్హులత కల్గిన పిల్లలకు పరికరాలు పంపిణీ చేశారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్డ్ అండ్ సీనియర్ సిటిజన్ సూపరిం టెండెంట్, ప్రత్యేక పాఠశాల హెడ్మాస్టర్లు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుంకేసుల బాదుల్లా

హామీని నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్నికల సందర్భంగా దూదేకులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఎంబిసి రాష్ట్ర అధ్యక్షులు సుంకేసుల బాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం ఎంబిసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20లక్షల జనాభా ఉన్న దూదేకులకు ఒక్క ఎంఎల్ఎ, ఎంఎల్సి, ఎంపి లేకపోవడం బాధకరమని పేర్కొన్నారు. నూర్బాష్ దూదేకులకు ప్రతిఏటా రూ.100 కోట్లు బడ్జెట్లో నిధులు ఇచ్చి ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని కోరారు. దూదేకుల కార్పొరేషన్ పాలక వర్గాన్ని ఏర్పాటు చేసి రుణాలు అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుశాయప్ప, ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, కార్యదర్శి రెడ్డయ్య పాల్గొన్నారు.

ఎల్ఎల్బి పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం, డిగ్రీ ఎల్.ఎల్.బి సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్త పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.ఎస్.వి కృష్ణారావు, సహాయ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాస రావుతో కలిసి విడుదల చేశారు. వైవీయూలోని తన ఛాంబర్లో ఫలితాల విడుదల సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ఎల్బి (ఫైవ్ ఇయర్స్) రెండో సెమిస్టర్ లో 67 మంది, నాలుగో సెమిస్టర్లో, 9 మంది, ఆరో సెమిస్టర్ లో 59 మంది, ఎనిమిదో సెమిస్టర్లో 53 మంది, పదో సెమిస్టర్లో 108 మంది ఉత్తీర్ణతసాధించారని చెప్పారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట జాతీయ జెండాను డిప్యూటీ డిఇఒ రాజగోపాల్రెడ్డి ఎగురవేశారు. అనంతరం గ్రంథాలయ ఉద్యమ నాయకులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వావిలాల గోపాలకృష్ణ, జవహర్లాల్ నెహ్రూ చిత్రపతాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం ఉధృతం కావడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. పిల్లలు పఠణాశక్తిని పెంపొందుంచుకోవాలని చెప్పారు. రిటైర్డ్ ఆర్ఐఒ పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్ మాట్లాడుతూ నెహ్రూ జయంతి పిల్లల దినోత్సవంగా చేసుకుంటారని చెప్పారు. వారోత్సవాలు 20 వరకు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన్కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ బాబ్జీ, గ్రంథాలయ సిబ్బంది సుబ్రమణ్యం, నవాజ్, జాన్, జేమ్స్, శ్రీనివాసచారి, జెవివి రాష్ట్ర నాయకులు ఎ.డి.దేవదత్తం, జిల్లా అధ్యక్షులు షమీర్బాష, నాయకులు పుష్పరాజు, ప్రతాప్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి- కడప సిటీ

వైద్య విద్యలో చేరిన ప్రతి విద్యార్థీ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్, అడిషనల్ డిఎంఇ డాక్టర్ ఎ.సురేఖ ఆకాంక్షించారు. కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణంలో కాన్ఫరెన్స్ హాల్లో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రిన్సిపల్ మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసించేందుకు వచ్చిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. వైద్య విద్యను అంకితభావంతో అభ్యసించాలని, సమాజంలో పేద ప్రజలకు చిత్తశుద్ధితో వైద్య సేవలను అందించి వారి ప్రాణాలను కాపాడే దిశగా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమా దేవి, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం సురేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపళ్లు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీ నరసమ్మ, అనస్తీసియా హెచ్ఒడి డాక్టర్ సునీల్ చిరువెల్ల, డాక్టర్ బాలిరెడ్డి, డాక్టర్ స్వరూప రాణి, వైద్యులు వైద్య సిబ్బంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్రమంలో వైద్య విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

సంఘీభావ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల వల్ల అభయ, శుభం తెలియని వేలాది మంది ప్రజలు చనిపోతున్నారని, చర్చల ద్వారా పరిష్కరించుకుని దాడులను విరమించాలని కడప సిటిజన్స్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఓబుల్రెడ్డి, డాక్టర్ రాజా వెంగల్రెడ్డి, బాబు బాయ్ కోరారు. గురువారం ప్రెస్క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో యుద్ధాలు చేసుకోవడం అమానుషమని పేర్కొన్నారు. యుద్ధం మానవతా విలువలను కాలరాస్తుందని చెప్పారు. ప్రజల మధ్య శాంతి, సహజీవనం ఉండాలని తెలిపారు. యుద్ధం తక్షణమే అపాలని కోరారు. ఈ నెల 16న సాయంత్రం 4 గంటలకు జడ్పి హాలులో సంఘీభావ సభ ప్రారంభమతుందని పేర్కొన్నారు. ఎంఎల్సి లక్ష్మణరావు, ఎడిటర్ వేణుగోపాల్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. మానవతావాదులు, సామాజిక వేత్తలు, వివిధ ప్రజా సంఘాల శాంతి కాముకులు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సాహితీ స్రవంతి నాయకులు పిళ్లా విజయ కుమారస్వామిరెడ్డి, కృష్ణయ్య, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘురామరాయనాయుడు

రాష్ట్ర అడహక్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-కడప అర్బన్ : నగరంలోని రాజీవ్ మార్గ్ రోడ్డులో ఉన్న ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గురువారం ఎపి వ్యవసాయ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అడహక్ కమిటీ ఏర్పాటు చేశారు. చైర్మన్ టి.వి.రామిరెడ్డి, కన్వీనర్ కాకర్ల వేంకటేశ్వరరావు, కోశాధికారి దొగురు శ్రీహరి, సభ్యులు వి.రఘురామనాయుడు, ఎం.శ్రీహరి, హెచ్. రూపేష్కుమార్, ఎం.ఎ.ప్రసాద్గౌడ్ ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తదుపరి జిల్లాల వారిగా అడహక్ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సభ్యత్వం చేసి, వీలైనంత త్వరగా జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసే వరకూ పోరాటం : వైసిపి

ప్రజాశక్తి - కడప : చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేంతవరకు వైసిపి పోరాటం సాగిస్తుందని వైసిపి కమలాపురం ఇన్ఛార్జి నరేన్ రామాంజుల రెడ్డి హెచ్చరించారు. గురువారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. రాబోవు రోజుల్లో రాష్ట్ర ప్రజలకు పన్ను పోటు తప్పదు అని అన్నారు. చంద్రబాబు కూటమి ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఇది స్పష్టంగా అర్థం అవుతుందని చెప్పారు. ఐదు నెలల తర్వాత బడ్జెట్ పెట్టి లోపభూయిష్టంగా మార్చారని విమర్శించారు. కూటమి ఇచ్చిన హామీలు చూస్తే రూ. 4 లక్షల కోట్లు బడ్జెట్ అవసరమన్నారు. వచ్చే ఆదాయం 2 లక్షల కోట్లు ఉంటే జీతాలు, అప్పులు వడ్డీలకు 1.89 లక్షల కోట్లు కట్టాలని, మిగిలిన వాటికి ఎక్కడి నుంచి ఇస్తారని ప్రశ్నించారు.

చిన్న సమస్యలకు కుంగిపోరాదు

ఆర్‌డిఒ ఆదిమూలపు సాయిశ్రీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

చిన్న సమస్యలకు కుంగిపోరాదని ఆర్‌డిఒ సాయిశ్రీ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె తెలిపారు. గురువారం గుడెంచెరువు కస్తూరిబా గాంధీ విద్యాలయంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి ఆదేశాల మేరకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా ఆర్డీఓ సాయిశ్రీ 250 మంది బాలికలకు దుప్పట్లను, శానిటరీ కిట్లను పంపిణీ చేశారు. గోనా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆది ఆధ్వర్యంలో హాస్టల్‌కు కావాల్సిన అన్ని వసతులు అందజేస్తామన్నారు. పట్టణంలో ఉన్న అన్ని హాస్టల్‌లో కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన పలురకాల పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు ఆర్డీఓ సాయిశ్రీ, బిజెపి నాయకులు గోనా పురుషోత్తంరెడ్డి, సీవ లింగప్ప బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీనే

- కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



అధికారంలో ఉన్న తెలుగుదేశం, గతంలో అధికారంలో ఉన్న వైసిపి దొందూ దొందే అని, ఆయా పార్టీలకు ప్రజాసేవలో ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీనే అని 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...పిసిసి చీఫ్ షర్మిల, కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయజ్యోతి తనపై నమ్మకం ఉంచి తనను ప్రొద్దుటూరు కాంగ్రెస్‌పార్టీ కో-ఆర్డినేటర్‌గా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నాను. ప్రొద్దుటూరులో చెప్పుకోతగ్గ అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. దివంగత నేత వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ప్రభుత్వాసుపత్రి, పశువైద్య కళాశాల, వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల, రింగ్‌రోడ్డు, మున్సిపల్ నూతన భవనం వంటివి వచ్చాయన్నారు. పట్టణంలో దోమలబెడద లేకుండా చేసేందుకు 41ఫాగింగ్ యంత్రాలతో సమస్యను పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ పని చేయలేని దౌర్భాగ్యస్థితిలో మున్సిపాలిటీ ఉండడం దురదృష్టకరమన్నారు. నాయకులు ప్రజలను కేవలం ఓట్ల యంత్రాలుగా చూస్తున్నారని విమర్శించారు. ప్రజల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి ప్రజా సమస్యల పరిష్కారానికి అసెంబ్లీకి వెళ్లని వారికి ప్రజాస్వామ్య జీతంగా తీసుకునే అర్హత లేదన్నారు. మాజీ సిఎం జగన్‌తోపాటు 10 మంది వైసిపి ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఆయన తెలిపారు. షర్మిల ఆధ్వర్యంలో ప్రజాపక్షాన పోరాడతామని ఇర్ఫాన్ పేర్కొన్నారు.

నేడు అన్నదానం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొల్లూరు పంచాయతీలోని నాగనాధేశ్వర కోనపై కార్తీకపౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. రంగాపురం గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గత 15 సంవత్సరాలుగా నిర్విరామంగా అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని వారు తెలిపారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - చక్రాయపేట

మండల, గ్రామాభివృద్ధి ప్రణాళికపై ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిటిసిలకు, సర్పంచులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2025-2026 ముందస్తు ప్రణాళికపై సర్వే చేసి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పేదరికం లేని, మెరుగైన జీవనోపాధుల గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం వంటి పలు అంశాలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి శివప్రసాద్‌రెడ్డి, టిడిపి విజయకుమార్ నాయక్, శ్రీహరి, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిఎలు పాల్గొన్నారు. **చాపాడు :** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులను వినియోగించుకోవాలని ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో గ్రామ పంచాయతీ నిధుల వినియోగంపై ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులను నేరుగా పంచాయతీ ఖాతాలోనే జమ చేస్తుందన్నారు. ప్రాతినిధ్య పనులకు నిధులను వినియోగించుకోవాలన్నారు. ఎంపిపి టి.లక్ష్మమ్మ మాట్లాడుతూ నిధులను వినియోగించుకొని పంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు చేసిన పనులకు వెంటనే బిల్లులు సిద్ధం చేయాలని తెలిపారు. అనంతరం ట్రైనర్లు ప్రజా ప్రతినిధులకు నిధుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** గ్రామ పంచాయతీ అభివృద్ధికి సర్పంచుల సహకారంతో కార్యదర్శులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడిఒ ముకుందరెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సభా భవనంలో గురువారం ఎంపిడిఒ ఆధ్వర్యంలో కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసిలు, డిజిటల్ సహాయకులకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. గాంధీ, నెహ్రూ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈఓపిఆర్డీ వీర భద్రుడు, కార్యదర్శులు లక్ష్మి నారాయణ, విజయ భారతి పాల్గొన్నారు. **పెద్దముడియం :** ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి అధికారులతో ఎంపిడిఓ సైరాబాను శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో తాగునీరు, వీధి దీపాలు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, పరిసరాల శుభ్రత వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి అనురాధ, ఇఒపిఆర్డి విజయభారతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'బాగా చదివి ఉన్నతస్థితికి రండి'

జమ్మలమడుగు రూరల్ : విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థితిలోకి రావాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి భార్గవి సూచించారు. గురువారం జడ్జి స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. సమయానికి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు : జడ్జి



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విజయజ్యోతి

ప్రజాశక్తి - కడప

నేటి బాలలే రేపటి పౌరులని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ అందుల బాలుర పాఠశాలలో, రాష్ట్రీయ సేవా సమితి ప్రత్యేక పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ భారతదేశం మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని నవంబర్



కడప : హెల్లెన్ కెల్లర్ అంధుల పాఠశాలలో..

14వ తేదీన బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని చెప్పారు. విద్య హక్కు, నైతిక విలువలు, రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యత, జాతీయ జెండా, జాతీయ గీతం, రాజ్యాంగ సంస్థల పట్ల గౌరవం మొదలగు అంశాల పట్ల అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్డ్ అండ్ సీనియర్ సిటిజన్ సూపర్‌ఇండెంట్, ప్రత్యేక పాఠశాల హెడ్మాస్టర్లు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. **బద్వేల్ :** తరగతి గదులలో రూపుదిద్దుకుంటున్న నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తుకు దిక్సూచికలని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.పెంచలయ్య పేర్కొన్నారు. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ మాదన విజయ కుమార్, ఉపాధ్యాయులు పి.సుబ్బరాయుడు, ఎస్.వరలక్ష్మి, ఎస్.గౌస్ బాష, వై.రామ్మోహన్, డి ఇందిర, ఎం.నరేష్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఓంకారం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గురువారం నెహ్రూ జయంతి, గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యోగివేమన యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు కొండపల్లి చిన్న సుబ్బారావు, బద్వేల్ పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నానబాల వెంకటేశ్వర్లు, బద్వేల్ గురుమూర్తి సంయుక్త కార్యదర్శి ఎం. శ్రీనివాసులు, బద్వేల్ పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్. ఏ సత్తార్ హాజరై చాచాజీ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. **కాశినాయన :** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు ఆకుల నారాయణపల్లె ప్రాథమిక పాఠశాలలో ఆ పాఠశాల హెచ్ఎం యు.సుబ్రమణ్యం, రమణారెడ్డి, అంగన్వాడీ టీచర్ టీచర్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి పిల్లలకు బహు మతులు స్వీట్లు పంపిణీ చేశారు. ఏపీ మోడల్ పాఠశాలలోనూ పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. **సింహాద్రిపురం :** విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరగుంటపల్లి, సింహాద్రిపురం గ్రంథాలయ అధికారులు శేఖర్, గంగాదేవి సూచించారు. గురువారం ఆయా గ్రంథా లయాలలో వారోత్సవాల సందర్భంగా మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. **వేంపల్లె :** భారత తొలి ప్రధాని నెహ్రూ గొప్ప దేశ భక్తుడు, దార్శనికుడని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. భారత రత్న పండిట్ నెహ్రూ జయంతిని గురువారం కాంగ్రెస్ నాయకులు వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, వేమా రాజా, బాలం సుబ్బరాయుడు, వెంకటేష్, మాష్, బద్రి, రవి, ప్రసాద్, వేమయ్య పాల్గొన్నారు. **ఖాజీపేట :** నేటి బాలలు రేపటి పౌరులని బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రూప్-1అధికారి బీరం శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమాన్ని ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ ప్రముఖులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఖాజీపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హాజీ గౌస్, చరిత్రకారుడు ఇంతియాజుద్దీన్ పాల్గొన్నారు. **ముద్దనూరు :** గ్రంథాలయాలు జ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ఎంఇఒ నాగేశ్వర నాయక్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో అధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవరెడ్డి, పద్మనాభరెడ్డి, యోగా మాస్టర్ రాము పాల్గొన్నారు. **ముద్దనూరు :** బావి తరాల భవిష్యత్ బాలల చేతుల్లోనే ఉందని నవ సమాజ స్థాపనకు బాలలు కృషి చేయాలని ప్రధానో పాధ్యాయులు రాజబాబు తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా రాజబాబు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీడీ మాధవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **వేంపల్లె :** మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో గురువారం ఘనంగా బాలల దినోత్సవం వేడుకలను నిర్వహించారు. మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీ చైతన్య పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులతో వేషధారణ వేయించారు. ఉషాకిరణ్, వికాస్, స్వామి వివేకానంద, శ్రీనివాస, లిటిల్ ఫ్లవర్, నారాయణ పాఠశాలలో కూడా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒంగోలు, ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్, గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో లైబ్రేరియన్ వనజా కుమారి, వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో పిల్లలకు చాక్లెట్లును రహంతుల్లా పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, వికాస్ పాఠశాల కరస్పాండెంట్ రఫీయా, స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ రామాం జనేయరెడ్డి, శ్రీనివాస పాఠశాల కరస్పాండెంట్ కేశవులు, నారాయణ పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి, లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, ప్రిన్సిపల్ మొబీనా, డైరెక్టర్ డాక్టర్ అన్వర్, ఇక్బాల్ బాషా, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరి పాలన అధికారి డాక్టర్ రవికుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి వనజా కుమారి తెలిపారు. గురువారం వేంపల్లెలోని అంబేద్కర్ గ్రంథాలయంలో ఆమె మాట్లాడుతూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. గ్రంథాలయంలో ఉన్న దినపత్రికలు, పోటీ పరీక్ష పుస్తకాలను చదవాలని




కడప : గురుకుల్ విద్యాపీఠ్ పాఠశాలలో..

కోరారు. **పులివెందుల రూరల్ :** భారత రాజకీయాల్లో శక్తి వంతమైన నెహ్రూ-గాంధీ కుటుంబానికి జవహర్‌లాల్ నెహ్రూ మూల పురుషుడని కాంగ్రెస్ పార్టీ పులివెందుల ఇన్‌ఛార్జి ధృవకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నెహ్రూ జయంతి సందర్భంగా పులివెందుల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ధృవకుమార్‌రెడ్డి, పులివెందుల ముఖ్య నాయకులు అనిల్‌కుమార్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వినోద్‌కుమార్ రెడ్డి, జయచంద్రారెడ్డి, రాజారెడ్డి, సాయి, వినయ్, ప్రమోద్, శంకర్




కడప : సాయిబాబా స్కూల్లో..

పాల్గొన్నారు. **వేముల :** స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేముల గ్రామ సర్పంచ్ సాకే రామాంజనమ్మ ప్రారంభించారు. భారతదేశ మొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి నారుబోయిన గంగాధర్ యాదవ్, ఉపాధ్యాయులు సావిత్రి, శివశంకర్, పాఠకులు లక్ష్మీనారాయణరెడ్డి, నీలిమ, పుష్ప, అబ్దుల్ మహమ్మద్ వలి, విద్యార్థులు పాల్గొన్నారు. **వేముల :** మండల కేంద్రంలోని స్థానిక అంగన్వాడీ కేంద్రంలో గురువారం బాలల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఓ సునీత, అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు పాల్గొన్నారు. **చాపాడు :** స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చాపాటి రామసుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొట్టమొదటి భారత ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. **గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం..** చాపాడు శాఖా గ్రంథాలయంలో గురువారం బాలల దినోత్సవ సందర్భంగా జవహర్లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఈఓ వంశీకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జె.శివశంకర్ రెడ్డి, బీడీసీలు రవిశంకర్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, పాఠకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మైదుకూరులో..** మైదుకూరు శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. నెహ్రూ చిత్ర పటానికి హైస్కూల్ హెచ్ఎం రామ్మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు, హైస్కూల్ ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు. **బ్రహ్మంగారి మఠం :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె.హరి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. చదవడం వల్ల కొత్త విషయాలు తెలుసు కోవచ్చుని, పుస్తక పఠన మంచిది అని అందరూ అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. పుస్తక ప్రదర్శన చేసిన కళాశాల లైబ్రేరియన్ ప్రేమ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మనాభమూర్తి, సుబ్బారామయ్య, ఉమా మహేశ్వరుడు, శ్రీనివాసులు, బసిరెడ్డి, గురురత్నం, అశోక్, నాగభూషణం, నాగ సుబ్బారెడ్డి, రాజేష్, ప్రవీణ్, తిరుపాల్, మహేంద్ర, సంశీర్ పాల్గొన్నారు.



వల్లూరు ఎపి ఆదర్శ పాఠశాలలో..



కడప : ఢిల్లీ ఇంటర్‌నేషనల్ పబ్లిక్ స్కూల్లో..

విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమే

ప్రజాశక్తి - చక్రాయపేట

విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమని కర్నూలు జిల్లా గురుకుల పాఠశాల సమన్వయ అధికారి డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆ కళాశాల ప్రిన్సిపల్ పి.సురేంద్రబాబు ఆధ్వర్యంలో జోన్ బి4 క్రీడా పోటీల్లో 21 గురుకుల పాఠశాలల నుండి 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, హ్యాండ్ బాల్, పరుగు పందెం తదితర క్రీడా పోటీలు నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సురేంద్రబాబు తెలిపారు. 8,9,10, జూనియర్ విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎంపికవుతారని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా గురుకుల డిసిఓ పద్మజ, ప్రాంతీయ అధికారి వెంకటసుబ్బయ్య, ఎస్ఐ కృష్ణయ్య, చక్రాయపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ రంతుబాషా, మాజీ ఆటల క్రీడాధికారి రామచంద్రారెడ్డి, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ రామయ్య, ఎంపీటీసీ శాంతమ్మ, పీడీ వైకె ఎల్లారెడ్డి, పిఈటి రవి, 21 గురుకుల పాఠశాలల పీడీలు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి- లింగాల

క్రీడారంగంలో రాణించే దిశగా అడుగులు వేస్తూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని పులివెందుల రూరల్ సీఐ ఎన్‌వి రమణ పేర్కొన్నారు. మండలం పరిధిలోని ఇప్పట్ల గురుకుల పాఠశాల మైదానంలో నాలుగు రోజులు పాటు జోన్-4 స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రిన్సిపల్ సత్యవతి, అనంతపురం డిసిఓ ఉదయశ్రీ, ఎంఇఒ-2 రామకృష్ణ జ్యోతి ప్రజ్వలనతో క్రీడలను ప్రారంభించారు. కడప, చిత్తూరు, కర్నూల్, అనంతపురం జిల్లాల నుంచి 800 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. క్రీడాకారులు నువ్వా..నేనా అంటూ పోటీపడి ఆడారు. క్రీడా పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్ రావు, సర్పంచ్ అంకాలమ్మ, ఎంపీటీసీ రమాదేవి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలపై మరింత శ్రద్ధ పెట్టాలి

వేంపల్లె : స్వచ్ఛంద సేవకులు సమాజానికి ఉపయోగపడే మరిన్ని మంచి సేవా కార్యక్రమాలపై శ్రద్ధ పెట్టాలని టిడిపి నేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి పిసిఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా వేంపల్లెలోని భవిత కేంద్రంలో పని చేస్తున్న ఐఇఆర్టీ యశోదను సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాల్లో ప్రత్యేకత చూపిన సేవకులకు అవార్డులు ప్రదానం చేశారు. ఐఇఆర్టీ యశోదకు డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం జాతీయ సోషియల్ సర్వీస్ అవార్డు ఇచ్చి శాలువతో ఘనంగా సత్కరించారు. అవార్డు దక్కడం సంతోషాన్ని కలిగించిందని ఆమె తెలిపారు. అవార్డు రావడం పట్ల ఎంఇఓలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్ ఆమెను అభినందించారు. ఫౌండేషన్ చైర్మన్ శివరాజు పాల్గొన్నారు.

సభ్యత్వాల్లో మొదటి స్థానంలో నిలుపుతాం

ప్రజాశక్తి -వేంపల్లె

సభ్యత్వ నమోదులో వేంపల్లె మండలాన్ని జిల్లాలో మొదటి స్థానంలో నిలుపుతామని టిడిపి మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర తెలిపారు. గురువారం వేంపల్లెలోని ప్రియా తోట పరిధిలో 200 సభ్యత్వాలు పూర్తి అయిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ యుద్ధంలా టిడిపి సభ్యత్వాలు చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సహకారంతో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

జమ్మలమడుగు డిఎస్‌పిగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



జమ్మలమడుగు డిఎస్‌పిగా వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రకాశం జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణపై ప్రత్యేకదృష్టి పెడతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు సబ్ డివిజన్‌లోని ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. అన్ని స్టేషన్‌లోని ఫైల్స్‌ను పరిశీలించి, ఇక్కడ అధికంగా ఏ సమస్యలు ఉన్నాయో వాటిపై ప్రత్యేకదృష్టి పెడతామన్నారు.

గృహాలను సందర్శించి సర్వే చేయాలి

ప్రజాశక్తి - పెద్దముడియం

వారంలో అయిదు రోజులు రోజుకు అయిదు గృహాలను సందర్శించి సర్వే నాణ్యతగా చేయాలని జమ్మలమడుగు డివిన్ ఉప వైద్యాధికారి శాంతికళ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని మేడిదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పెద్దపసుపుల గ్రామంలో గురువారం ఎన్‌సిడి సిడి 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహమ్మద్ హుస్సేన్, ఆరోగ్య పర్యవేక్షకులు సోము వెంకటరమణ, శాంతకుమారి, ఎంఎల్‌హెచ్‌పి లావణ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు. అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** ముందస్తు పరీక్షలతో కేన్సర్ వ్యాధి నిర్ధారణ అయితే అవసరమైన మందులతో ఈ వ్యాధిని నయం చేసుకోవచ్చని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి అన్నారు. స్థానిక బొల్లవరంలో యన్‌సిడి 3.0 ఇంటింటి సర్వే ప్రోగ్రాంను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గురువారం నుండి వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వచ్చి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని నేతాజీ నగర్‌లో డాక్టర్ భరత్ నారాయణ, విజయనగరం వీధిలో డాక్టర్ ఆలీం దౌల, మోడంపల్లిలో డాక్టర్ నజీర్‌బాషా ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హిమబిందు, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, హెచ్ఇఒ సుబ్బరాయుడు, సూపర్‌వైజర్ జయమ్మ, సిఇ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **వేముల :** ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించి ప్రతి ఒక్కరికీ కేన్సర్ పరీక్షలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం మేరకు గురువారం ఆరోగ్య సిబ్బంది కార్యక్రమాన్ని పిహెచ్‌సిలో ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, మండల నాయకులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **చాపాడు :** ఎన్‌సీడి, కేన్సర్ సర్వే కార్యక్రమాన్ని మండల పరిధిలోని నక్కలదిన్నె సచివాలయంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ శశిభూషణం, ఎంపిపి టిలక్ష్మమయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపిఎం మాట్లాడుతూ కార్యక్రమంలో 18 సంవత్సరాలు నిండిన వారికి నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయం కేన్సర్‌తో పాటు హెచ్‌బి, బిపి, షుగర్ పరీక్షించి అనుమానిత కేసులను వైద్యశాలకు వివరాలను పంపుతారని తెలిపారు. మళ్లీ పరీక్షలు చేసి, అవసరమైన వారిని రిమ్స్‌కు తరలించి వ్యాధిని నిర్ధారిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని మంగళ, శుక్రవారం పూర్తిగా, గురువారం మాత్రం మధ్యాహ్నం వరకు సర్వే నిర్వహిస్తారని తెలిపారు. నక్కలదిన్నె వైద్యాధికారి ఓబులేసు, హెల్త్ సూపర్‌వైజర్ పి. బాబుల్ రెడ్డి, ఎంపిహెచ్‌ఒ కీర్తి, ఎఎన్ఎం సుజాత, ఆశాలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** ప్రతి ఇంటిని పక్కాగా సర్వే చేసి వ్యాధుల సమాచారం సేకరించాలని పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి సిబ్బందికి సూచించారు. కొత్తపల్లి, పెనికలపాడు, తిమ్మాపురం గ్రామాల్లో సిబ్బంది అంటు వ్యాధులు, బిపి, షుగర్, కేన్సర్, థైరాయిడ్ వ్యాధులపై సర్వే నిర్వహించారు. సర్వేను శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. స్క్రీనింగ్‌లో బయట పడిన వ్యాధులను అప్డేట్ చేసి వైద్యాధికారులకు తెలియజేయాలని ఆయన సూచించారు. **బ్రహ్మంగారిమఠం :** మండల పరిధిలోని నరసన్నపల్లె గ్రామంలో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన కేన్సర్ వ్యాధి పరీక్షల కేంద్రాన్ని మండల టిడిపి అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలలో కేన్సర్ వ్యాధి గుర్తింపు పరీక్షలు ఏర్పాటు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ సంపత్‌కుమార్, సిహెచ్‌ఓ సాంబశివారెడ్డి, హెల్త్ సూపర్వైజర్ పుష్పరాజ్ మాట్లాడారు. హెల్త్ సూపర్వైజర్ ఎల్వి రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్ మాధవ నాయుడు, సిహెచ్‌ఓ ప్రియాంక, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, జ్యోత్స్న, ఆశా వర్కర్లు, మండల టిడిపి నాయకులు సాంబశివారెడ్డి, మల్లెపల్లె సుధాకర్, గంగయ్య, గంగరాజు పాల్గొన్నారు.

పాఠకుల సేవలకు గ్రంథాలయం దూరం

ప్రజాశక్తి - ఖాజీపేట

విజ్ఞాన భాండాగారాలుగా పేరుగాంచిన గ్రంథాలయాలు పాఠకులకు సేవలు అందించడంలో ఆమడ దూరంలో ఉంటున్నాయి. గ్రంథాలయాల్లో పాఠకులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రంథాలయ సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు ఖాజీపేట లో మాత్రం మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని పాఠకులు ఆరోపిస్తున్నారు. గ్రంథాలయం పాఠకులకు అందుబాటులో లేకపోవడంతో పాఠకులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక మెయిన్ బజార్‌లోని మసీదు ఎదురుగా పై అంతస్తులోని ఓ భవనంలో గ్రంథాలయ కార్యాలయం ఉంది. పాఠకులు పై అంతస్తులోకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయ కార్యాలయాన్ని కింద ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. గ్రంథాలయాల పనితీరు సక్రమంగా లేదని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరబడిందన్నారు. అధికారి పాఠకులకు అందుబాటులో సమయానికి వచ్చి విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.

దళితుల పట్ల చిన్నచూపు తగదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజాస్వామ్య దేశంలో అందరికీ సమన్యాయం అందాలని, కానీ ప్రొద్దుటూరులో దళితుల పట్ల చిన్నచూపు చూడడం తగదని ఎంఆర్‌పిఎస్ నాయకులు సుధాకర్ మాదిగ పేర్కొన్నారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. .బుధవారం ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ పక్కన పెద్దమ్మ దేవాలయం ప్రాంగణంలో అమ్మవారి ప్రసాదం కోసం ఏర్పాటు చేసుకున్న రూములు పడగొట్టడం ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ తనకు తెలియకుండా రూములు పడగొట్టడం ఆదేశాలను ఉల్లంఘించినట్లే అన్నారు. ప్రొద్దుటూరులోని అక్రమ కట్టడాల జాబితాను సోమవారం దళిత నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు ఇస్తామని తెలిపారు. మూడురోజుల్లో అక్రమ కట్టడాలను కూల్చితే అధికారుల చర్యలను తాము స్వాగతిస్తామన్నారు. నాయకుల మాటలకు ఇక్కడి ప్రవర్తన భిన్నంగా ఉందన్నారు. గొర్రె శ్రీనివాసులు ముఖ్య అనుచరుడు అంజి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని, ఒక దళిత నాయకుడు పైకి ఎదుగుతూంటే ఓర్వలేకపోతున్నారన్నారు.

కుల గణాంకాల సేకరణ కమిషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎస్‌సి కుల గణాంకాల సేకరణకు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చేత కమిషన్ ఏర్పాటు చేయాలని ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్ద కాలంగా రాజ్యాంగ పరమైన ఎస్సీ రిజర్వేషన్లు మాదిగ ఉపకులాలకు న్యాయం జరగలేదన్నారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అడ్డంకులు లేకుండా రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మహిళలపై నేరాలు అరికట్టేందుకు ప్రతి నియోజకవర్గంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డప్పు చర్మకారుల రాష్ట్ర కన్వీనర్ కరిలింగ గాండ్ల నాగభూషణం మాదిగ, మంత్రాల పవన్‌కుమార్, ఓబులేసు, ఎమ్మార్పీఎస్ నాయకులు, డప్పు చర్మకారులు, మహిళలు పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పెన్నా నది నుండి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను గురువారం తహశీల్దార్ రమాకుమారి ఆదేశాల మేరకు పోలీసులు పట్టుకున్నారు. అధికారుల అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తహశీల్దార్ స్పందించారు. వాహనాలను రెవెన్యూ కార్యాలయం వద్ద ఉంచారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలకు ఏదైనా అవసరాలు ఉంటే సంబంధిత సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శుల అనుమతి తీసుకోవాలన్నారు.